క్లుప్తంగా

తిమ్మందొడ్డిలో చోరీ కేసు నమోదు

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో ఒక ఇంట్లో జరిగిన దొంగతనంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ తెలియజేస్తూ.. తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన చెన్నా రెడ్డి ఇంట్లో గురువారం గుర్తు తెలియని దుండగులు చొరబడి బంగారు, వెండి ఆభరణాలను దొంగలించినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడున్నర తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసి, విచారణ చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ ఫాతిమా

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మహిళల ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫాతిమా మాట్లాడుతూ యువతుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే ఆరోగ్యకర జీవన శైలిని అలవాటు చేసుకోవాలన్నారు. మహిళల స్వీయ అవగాహన బలమైన కుటుంబాలు, సహజ నిర్మాణంలో కీలకమని ఆమె సూచించారు. కార్యక్రమంలో సాధికారిత సెల్ సమన్వయకర్త హరిత, తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇవ్వాలని జేసీ బెదిరించడం తగదు

కర్నూలు(సెంట్రల్): ఆలూరు మండలం మనేకుర్తి గ్రామ రైతులను పవర్‌గ్రిడ్ ప్రాజెక్టు కోసం భూములు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య బెదిరించడం న్యాయం కాదని, బలవంతంగా భూసేకరణ చేస్తే అన్నదాతల నుంచి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సారవంతమైన 195 ఎకరాలను బలవంతంగా ఇవ్వాలనడం భావ్యం కాదన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో 90 శాతం మంది రైతులు వ్యతిరేకించినా భూములు ఇవ్వాలని బెదిరించడం అన్యాయమన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 80 శాతం మంది రైతులు అంగీకరిస్తేనే ప్రాజెక్టుల కోసం భూములు తీసుకోవాల్సి ఉంటుందని, ఆ విషయాన్ని జేసీ తెలుసుకోవాలన్నారు.

రేపు వరల్డ్ హార్ట్ డే

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులో ఈ నెల 28వ తేదీన జరగనున్న వరల్డ్ హార్ట్ డే వేడుకలను జయ ప్రదం చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2002 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2011లో కర్నూలు హెల్త్ క్లబ్ స్థాపించి ప్రతి నెలా వైద్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ యేడాది వరల్డ్ హార్ట్ డే సందర్భాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌కు చెందిన కార్డియాలజిస్టు డాక్టర్ ప్రతాప చంద్రకు అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరవుతున్నట్లు తెలిపారు.

కేసీలో గల్లంతైన విద్యార్థి కోసం గాలింపు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని ఎస్ఏపీ సీఆర్ఆర్ మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు గల్లంతు కావడం బాధాకరమని, అందులో ఒక్క విద్యార్థి మరణించడం, మరో విద్యార్థి ఆచూకీ లభించకపోవడంతో కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో విచాకరం వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థి ప్రశాంత్ కోసం గాలింపు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. చనిపోయిన విద్యార్థి అశోక్ కుటుంబానికి ఆమె సానుభూతి తెలిపారు.

ఈతకు వెళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త!

కర్నూలు: దసరా సెలవుల నేపథ్యంలో యువకులు, విద్యార్థులు ఈతకు వెళ్లడం వల్ల ప్రమాదకర ఘటనలు జరిగే అవకాశమున్నందున జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని గ్రామాలు, పట్టణ శివారులో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాల్వలు పూర్తిగా నిండిపోయాయని, తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నదీ తీర ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా, ఏవైనా సమస్యలు ఉంటే 112కు డయల్ చేసి సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆపదలు, అత్యవసర పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలు, ఏ సమస్య అయినా 112కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

రహదారులు అధ్వానం.. ప్రయాణం నరకం

- అడుగుతీసి అడుగు వేయాలంటే నరకమే
- రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోని పాలకులు
- గ్రామాల్లో దయనీయంగా లింకు రోడ్లు



పుల్లారెడ్డి హాస్టల్ ముందు రహదారిపై గుంతలు

కర్నూలు(రూరల్): మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వం గత జనవరికే రోడ్లన్నింటినీ బాగుచేసి అద్దాల్లా మారుస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసింది. కానీ అధికారం చేపట్టి 16 నెలలు అవుతున్నా కనీసం మరమ్మతుల గురించి కూడా పట్టించుకోవడం లేదు. కనీసం తట్ట మట్టి పోసిన దాఖలాలు కూడ లేవు. ఫలితంగా గుంతలు పడిన రహదారుల్లో ప్రయాణం చేసేందుకు ప్రజలు జంకుతున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లకు కనీసం మరమ్మతులు చేసేందుకు కూడా అధికారులు ప్రాతిపాదనలు తయారు చేయడం లేదు. ఇక పాలకులు రోడ్ల గురించి ఎప్పుడో మరచిపోయారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ఎలా?

మండల పరిధిలోని పుల్లారెడ్డి బాయ్స్ హాస్టల్ నుంచి జగన్నాథగట్టు ఆలయం వరకు (దిన్నెదేవరపాడు గ్రామ పరిధి రహదారి) దాదాపు 2 కి.మీ దూరం ఉంది. ఈ దారి అడుగడుగునా గుంతలు పడి ఛిద్రం కావడంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లు తేలి అధ్వానంగా అడుగుకో గొయ్యి.. గజానికో గుంత ఉండటంతో రాకపోకలకు ప్రజలు నరకం చూస్తున్నారు. గోతుల వల్ల ఒళ్లు హూనం కావడంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. రోడ్డుపై కంకర తేలి ఆన వాళ్లు కోల్పోవడంతో నరకయాతన పడుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. వర్షాలకు రోడ్డు గోతులమయంగా మారింది. కంకర మొత్తం లేచి ప్రమాదకరంగా తయారైంది. రోడ్డుపై అడుగు పెట్టాలంటే ఒళ్లు గుల్లవుతునట్లు టీజీ నగర్ కాలనీ వాసులు వాపోతున్నారు. వర్షా కురిస్తే రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచి చిన్నపాటి కుంటలను తలపిస్తోందని స్థానికులు అంటున్నారు. ఈ మార్గంలో వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

బి.తాండ్రపాడు- దిన్నెదేవరపాడు రెండు గ్రామాల వాహనదారులతోపాటు గట్టు పైకి వెళ్లే భక్తులు, సందర్శకులు, గట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటీకి రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు, పుల్లారెడ్డి ఇంజినీరింగ్, డెంటల్ కాలేజీ, రాయలసీయ యునివర్సిటీకి వచ్చే విద్యార్థులు ఉద్యోగులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు అవస్థలు పడుతున్నారు. ప్రమాదకరంగా మారిన రోడ్డుపై ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి జారిపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దిన్నెదేవరపాడు టీజీ నగర్ సమీపాన గుంతలమయంగా రోడ్డు



అనాథాశ్రమం ఎదురుగా రోడ్డుపై గుంత

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కల్లూరు : వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కలుషిత నీరు తాగడం వలన కలిగే వ్యాధుల ప్రభావంపై ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు మొదటి ఆరు నెలలు తప్పని సరిగా తల్లి పాలు మాత్రమే తాగించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణంపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. వాంతులు ,విరేచనాలు అయినప్పుడు డిహైడ్రేషను నివారించడంలో ఓఆర్ఎస్ ద్రావణం చాలా కీలకంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మోతీలాల్ నాయక్ గారు, కన్సల్టెంట్స్ సుధాకర్, మల్లికార్జున, పీహెచ్ఎన్ నారాయణమ్మ, పర్యవేక్షకులు సంపత్, మంజుల, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సిగ్మా 2కే 25 పోస్టర్ ఆవిష్కరణ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో సిగ్మా 2కే 25 కార్యక్రమ పోస్టర్ శుక్రవారం ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో 15వ జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిగ్మా 2కే విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిభ ఆలోచనలు, నూతన ఆవిష్కరణలకు వేదిక అవుతుందన్నారు. ఈ అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింపోజియం కన్వీనర్ ఫరూక్, సుకీర్తికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల్లో తుపాను గుబులు



కోడుమూరులో వర్షానికి చెట్ల మీదే తడిసిన పత్తి, నల్లగా మారిన పత్తికాయలు

- వర్షాలకు దెబ్బతింటున్న పంటలు

కోడుమూరు రూరల్: తుపాన్ ప్రభావంతో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలో తుపాన్ ప్రభావం వల్ల శుక్రవారం ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో చేతికొచ్చిన పత్తి, సజ్జ, కొర్ర, వేరుశనగ, ఉల్లి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముంది. ముఖ్యంగా పత్తి, ఉల్లి, సజ్జ వంటి పంటలు అధిక వర్షం కారణంగా దెబ్బతింటున్నాయని, ఇలాగే కురిస్తే దిగుబడులు తమ చేతికి అందడం కష్టమని రైతులు వాపోయారు. ఇప్పటికే అధిక వర్షాల వల్ల పత్తి పొలాలన్నీ ఎర్రగా మారడంతో పాటు, కాయలు కుళ్లి పోవడంతో తీవ్రంగా నష్టపోయామని, మళ్లీ వానలు మొదలవ్వడంతో ఉన్న కాస్త పంట కూడా దెబ్బతిని దిగుబడులు చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.



గగ్గటూరు గ్రామం ముందు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



వద్దుగండ్ల-రసూళ్లపేట గ్రామాల మధ్య పొంగి ప్రవహిస్తున్న కావేటివాగు

వదలని వర్షం

కల్లూరు/పాణ్యం: పాణ్యం నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వర్షం వదలకుండా పడుతూనే ఉంది. దీంతో ఓ వైపు వాగులు, వంకలు పొంగిపొర్లి పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోగా మరోవైపు పంటల నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామాల్లో రహదారుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. రోడ్లు చిత్తడిమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వృద్ధులు, చిన్న పిల్లలు ముసురు కమ్ముకోవడంతో బయటకు రాలేని పరిస్థితి. పాణ్యం మండలంలో గగ్గటూరు-రాయపాడు గ్రామాల మధ్య , వద్దుగండ్ల-రసూళ్లపేట గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగి ప్రవహించాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి వాగులపై బ్రిడ్జి ఎత్తు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మిస్టర్ ఇడ్లీ హోటల్ సమీపంలో చెరువును తలపిస్తున్న రోడ్డు



కల్లూరు పరిధిలోని గుత్తి పెట్రోల్ బంకు సర్కిల్‌లో నిలిచిన వర్షపు నీరు

మహాలక్ష్మి.. పరమపావని



మహాలక్ష్మి అలంకరణలో వల్లెలాంబాదేవి



మహాలక్ష్మి అలంకరణలో అంబా భవాని



మహాలక్ష్మి అలంకరణలో సుంకులా పరమేశ్వరి



కరెన్సీ నోట్ల అలంకరణలో మహాలక్ష్మి



మహాలక్ష్మిగా దర్శనమిస్తున్న పార్వతీ దేవి



నిడ్జూరులో లక్ష్మీదేవి అలంకరణలో దుర్గమ్మ



లక్ష్మీదేవి అలంకరణలో వెంకాయ పల్లె ఎల్లమ్మ



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ



మహాలక్ష్మీగా దర్శనమిస్తున్న అమ్మవారు



పాణ్యం ఏఆర్ కాలనీలో కరెన్సీ మాల అలంకరణలో అమ్మవారు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి, కాళికామాత, శ్రీరాములమ్మ, తులజా భవాని, అంబా భవాని, వల్లెలాంబదేవి ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మి రూపంలో దర్శనమివ్వడంతో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అంబా భవాని ఆలయంలో 200 మంది మహిళలతో అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వల్లెలాంబదేవి ఆలయంలో సర్పంచు భాగ్యరత్న దంపతులు, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ క్రిష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- గూడూరు మండలం కె.నాగలాపురంలో వెలసిన సుంకులా పరమేశ్వరి దేవి మహాలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు.
- సి.బెళగల్: సి.బెళగల్ ఈశ్వరాలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. భక్తులు కుంకుమార్చనతో పాటు పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. పాత బస్టాండ్ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ, ఊయల సేవ నిర్వహించారు.
- కర్నూలు(రూరల్): మండల పరిధిలో మునగాలపాడు, నిడ్జూరు గ్రామ సమీపాన తుంగభద్ర నది ఒడ్డున మామిడి తోటలో వెలసిన దుర్గమ్మ వారు లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు నిమ్మకాయల దండ, బంతిపూల మాలలతో అమ్మవారిని అలంకరించి కాయకార్పూరాలు సమర్పించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వెంకాయపల్లె ఎల్లమ్మను లక్ష్మీదేవి అలంకరణలో ముస్తాబు చేశారు. కుంకుమార్చన, శివాభిషేకం, మహా మంగళహారతి పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.
- ఓర్వకల్లు: శరన్నవరాత్రుల సందర్భంగా మండలంలో కొలుదీరిన దుర్గామాత వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చారు. హుసేనాపురంలోని జాతీయ రహదారి పక్కన కొలువుంచిన అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమివ్వగా పురోహితులు జంధ్యాల మనోహర్‌శర్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సహకారంతో అమ్మవారిని రూ.77,777 విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. లొద్దిపల్లె ప్రధాన రహదారిపై కొలువుంచిన దుర్గామాత లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- పాణ్యం: స్థానిక ఏఆర్ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని నిర్వాహకులు కరెన్సీ మాలలతో మహాలక్ష్మీ రూపంలో అలంకరించారు. కరెన్సీ నోట్లు, నాణేలతో అలంకరించిన అమ్మవారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. అలాగే హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు.
- గడివేముల: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. అర్చకులు వసంత లక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన, మూల మంత్ర హోమం, అష్టోత్తర శతనామావళి పఠించారు. అనంతరం మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన గుప్తా తదితరులు పాల్గొన్నారు.



లొద్దిపల్లెలో లలితాదేవి అవతారంలో అమ్మవారు



హుసేనాపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



వల్లెలాంబదేవికి పల్లకీసేవ

జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నిర్మల

ఓర్వకల్లు: అమ్మకం పన్ను(జీఎస్టీ) తగ్గుదలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నిర్మల అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో జరిగిన వేర్వేరు సమావేశాల్లో నిర్మల మాట్లాడుతూ జీఎస్టీ అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న నాలుగు స్లాబ్‌లను తగ్గించి రెండు స్లాబ్‌లకు తీసుకొచ్చిందన్నారు. దీని వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నిత్యజీవితంలో వినియోగించే వస్తువుల ధరలు తగ్గాయన్నారు. జీఎస్టీ సంస్కరణ ప్రయోజనాలను తెలియజేయడానికి సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ నినాదంతో సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన గ్రామస్థాయిలో, అక్టోబర్ 4,5 తేదీల్లో మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కార్యాలయ సిబ్బంది సుధీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సభలో బాలయ్య వ్యాఖ్యలు సిగ్గుచేటు



వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శివారెడ్డి

కర్నూలు (టౌన్): అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రవర్తన, వ్యాఖ్యలు సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవిని అవమానించేలా అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన తీరు అత్యంత దురదృష్టకరమన్నారు. హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్న బాలకృష్ణ కనీసం ఒక్క రోజైనా నియోజకవర్గ సమస్యలు గురించి మాట్లాడారా? అని ప్రశ్నించారు. గతంలో బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిగినప్పుడు వైఎస్సార్ రాజకీయంగా ఆలోచించి ఉంటే, ఈ రోజు చేతులు జేబులో పెట్టుకొని నోటికొచ్చినట్లు మాట్లాడేవారా? అన్నారు. మానసిక స్థితి సరిగా లేదని సర్టిఫికెట్ తెచ్చుకున్న బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని, నిత్యం వైఎస్ జగన్‌పై ఏడుపు మానుకోవాలని హితవు పలికారు.